క్లుప్తంగా

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ



కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం తాళ్లమిట్ట కోదండరామిరెడ్డి గిరిజన కాలనీలోని తుఫాన్ బాధితులకు ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. వీటిని విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి చేతుల మీదుగా గిరిజనులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తి కృష్ణమ్మ, ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఏఆర్డీ సంస్థ డైరెక్టర్ షేక్ బషీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాటిపర్తి భాస్కర్, షేక్ మహబూబ్ బాషా, యరగాల పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శి ఒ.శ్రీనివాసులు, ఏఆర్డీ సభ్యులు ఎన్.ఏడుకొండలు, డి.పావని, వలంటీర్ పి.రమేష్ పాల్గొన్నారు.

విష్ణాలయంలో ధనుర్మాస పూజలు



మనుబోలు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవాలయం (విష్ణాలయం)లో ఆదివారం అర్చకుడు హనుమాచార్యులు ధనుర్మాస పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు. ముక్కోటి ఉపవాస దీక్షలు విరమించిన భక్తులు ఆలయంలో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఉభయకర్తలుగా కోడూరు సుబ్బరాయులు, పద్మావతమ్మ దంపతులు వ్యవహరించారు.

50 శాతం వరినాట్లు పూర్తి



పొదలకూరు: మండలంలో 50 శాతం వరినాట్లు పూర్తి చేశారు. మరో 50 శాతం నాట్లు వేస్తున్నారు. ఈ ప్రక్రియ సంక్రాంతి వరకు కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షానికి నాట్లు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఐదు వేల ఎకరాల్లో నాట్లు పూర్తయినట్లు ఏఓ ఎ.వాసు వెల్లడించారు. మరో 5 వేల ఎకరాల్లో నాట్లు పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటి వరకు ఎరువులు, పురుగు మందులకు ఎలాంటి ఢోకా లేకపోవడంతో వ్యవసాయ పనులు సాఫీగా సాగిపోతున్నాయి. గతేడాది ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉన్నా రైతులు పత్తిసాగు వైపు మళ్లి వరిసాగును 12 వేల ఎకరాల్లో మాత్రమే చేశారు. ఈ రబీలో పత్తిసాటు చేసేందుకు రైతులు సాహసించడం లేదు. గతేడాది నష్టాలు చవిచూడాల్సి రావడమే దీనికి కారణంగా చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో..



కోవూరు: స్థానిక వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమద్ వ్రత పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం కోదండరామస్వామి దేవస్థాన ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో హనుమద్ వ్రతాన్ని చేపట్టారు. పూలంగిసేవ, పల్లకి సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశ్వబ్రాహ్మణ సేవా సంఘం దాతృత్వం

కావలి: పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్‌లో నివసిస్తున్న మారెళ్ల శ్రీనివాస ఆచారి ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. ఆయనచేతికి బలమైన గాయం కావడంతో ఆస్పత్రిలో మెరుగైన వైద్యం చేయించుకున్నారు. సమాచారం తెలుసుకున్న కావలి పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పుత్తూరు సుధా ఆచారి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పాల్గొని శ్రీనివాస ఆచారికి ఆదివారం రూ.18,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. శ్రీనివాస ఆచారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వరిగొండ పంచాయతీలో సీసీ రోడ్లు, సైడ్ కాలువలను ప్రారంభించిన మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వరిగొండ గ్రామ సచివాలయ పరిధిలో మంత్రి ఆదివారం పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాలకులు ప్రచార ఆర్భాటంతో శంకుస్థాపనలు చేసి పనులను విస్మరించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శంకుస్థాపన చేసిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం చేసి చూపిస్తున్నామన్నారు. ప్రజల కోసం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు ఆర్బీకేలు, ఇంకా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు.

రూ.36.82 కోట్లతో..

వరిగొండ పంచాయతీకి సంబంధించి ఆదివారం ఒక్క రోజే రూ.3.15 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లవంటి వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలను చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఇంకా రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నులు సామర్థ్యం గల బహుళ ప్రయోజనాల గోదామును రైతులకు అంకితం చేయడం జరిగిందన్నారు. మొత్తంగా గడిచిన నాలుగేళ్ల ఎనిమిది నెలల కాలంలో ఈ పంచాయతీలో రూ.36.82 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. వరిగొండ వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి రూ.లక్ష వ్యయంతో సమకూర్చిన ఫ్రీజర్ (శవపేటిక)ను మంత్రి కాకాణి చేతుల మీదుగా పంచాయతీ పాలకులకు అప్పగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, తోటపల్లిగూడూరు, పేడూరు సొసైటీ అధ్యక్షులు కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, గండవరపు శ్యామలమ్మ, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, కోటా శేఖర్‌రెడ్డి, చిల్లకూరు ప్రవీణ్‌రెడ్డి, కోసూరు రవీంద్రయ్య, ఎంపీటీసీ సభ్యులు కోటా అనూష, జానా విజయమ్మ, సర్పంచ్ ఈగా సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కాంతులు



పొదలకూరులో చర్చి



ముత్తుకూరు: నేలటూరులో అలంకరించిన చర్చి

పొదలకూరు: పట్టణంలోని పరిజాన్ జేకబ్స్ లూథరన్ చర్చిలో ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాస్టర్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. అనంతరం చర్చిలో క్రిస్మస్ కేరల్స్‌ను నిర్వహించారు. శుభసందేశం వినిపించి రాత్రంతా జాగారం చేశారు. చర్చిని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. సోమవారం క్రిస్మస్ సందర్భంగా మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

- **ముత్తుకూరు:** లోకరక్షకుడి జన్మదినమైన క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, బోధనల నిమిత్తం మండలంలోని చర్చిలను రంగు రంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ముత్తుకూరు, పిడతాపోలూరు, వల్లూరు, కృష్ణపట్నం, పైనాపురం, నేలటూరు, పంటపాళెం, డమ్మాయపాళెం, నారికేళపల్లి తదితర గ్రామాల్లోని చర్చిలను వివిధ రంగుల నక్షత్రాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్రీస్తు జన్మవృత్తాంతం తెలిపే చిత్రాలను రూపొందించారు. క్రీస్తును స్వాగతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు.
- **తోటపల్లిగూడూరు:** క్రిస్మస్ సందర్భంగా మండలంలోని చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కోడూరు వేళాంగణి చర్చి, తోటపల్లిగూడూరు మరియమాత పుణ్యక్షేత్రాలకు భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు.

ముదిరాజ్‌లకు అండగా సీఎం జగన్

- కార్పొరేషన్ చైర్మన్ కొర్నా



క్యాలెండర్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

ఇందుకూరుపేట: రాష్ట్రంలోని ముదిరాజ్‌లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని, వారికి ప్రత్యేక స్థానం కల్పించారని ఆ కార్పొరేషన్ చైర్మన్ కొర్నా నారాయణరావు అన్నారు. గంగపట్నం శ్రీచాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయ ఆవరణలో ఉన్న కల్యాణ మండపంలో ఆదివారం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ఈ క్యాలెండర్లను ముద్రించి భక్తులకు అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్ సింగ్, బీజేపీ నాయకులు సుబ్బారాయుడు, ఎం.సురేష్, డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, గంపల సుబ్రహ్మణ్యం, గంపల వెంకటకృష్ణయ్య, సంగం వెంకటేశ్వర్లు, గుడి రామకృష్ణ, ముదిరాజ్ మహాసభ నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో యువకుల పాత్ర కీలకం

నెల్లూరు రూరల్: రాజకీయాల్లో యువకుల పాత్ర ఎంతో కీలకమని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 200 మంది యువత నగరంలోని ఎంపీ ఆదాల నివాసంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ తగిన గుర్తింపు కల్పిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెద్దఎత్తున యువత పార్టీలో చేరడం మంచి పరిణామమన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పాటుపడాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అలరించిన క్రీస్తు గాన జయంతి



క్రీస్తుగాన జయంతిలో గాయక బృందం, సంఘ నేతలు

నెల్లూరు(బృందావనం) : ఏసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని పాటలు, సంగీత రూపంలో తెలిపే క్రీస్తు గాన జయంతి అలరించింది. వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డొనీహాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో యువత మధురగీతాలను ఆలపించింది. కేఎస్ క్రిస్టోఫర్, గంటా రచించిన పాటలకు గుర్రం సుధాకర్, గుర్రం అరుణ్‌కుమార్, జమ్ముల జయకుమార్ స్వరకల్పన చేశారు. ఈ క్రీస్తుగాన జయంతిని 1966 నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు క్వైర్ డైరెక్టర్ బిల్లి శ్యామ్‌సన్ తెలిపారు. తెలుగు క్రైస్తవ సమాజంలో ఈ సంగీత ప్రక్రియ డొనీహాల్‌కు మాత్రమే సొంతమని తెలియజేశారు. సంఘ కాపరి రెవ. కె.శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. ఈ సంగీత విభావరికి మాంటి రొమెల్‌రాయ్, పీజే జోయల్ శ్యామ్, బెన్ని ఆకాష్‌ప్రిన్స్ వాద్య సహకారం అందించారు. సాహిత్య సంగీత సేవలందించిన గంటా థామస్ మౌంట్‌బాటన్, గుర్రం అరుణ్‌కుమార్, బిల్లి శ్యామ్‌సన్‌లను సంఘ పెద్దలు జమ్ముల జయకుమార్, నిర్మల సుధాకర్, ప్రభుదాస్‌పాల్, జార్జి స్టీవెన్‌సన్‌లు సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ సురేంద్రబాబు, కోశాధికారి జీబీ విజయభాస్కర్, మాంటి రొమెల్‌రాయ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జనవరి 10 నుంచి డాక్టర్ జీఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలో సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 10వ తేదీ నుంచి సోమశిల ప్రాజెక్ట్ యూత్, హెల్పింగ్ హార్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు జె.నారాయణ, యు.నాగరాజు, షేక్ మహమ్మద్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మొదటి బహుమతిగా రూ.20 వేలు నిర్ణయించడం జరిగిందని తెలిపారు.

నేడు మంత్రి కాకాణి రాక

తోటపల్లిగూడూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం కోడూరు వేళాంగణి మాత చర్చికి రానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిలో సోమవారం జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

గండవరం యోగా గురువు ప్రతిభ



కొడవలూరు: మండలంలోని గండవరం ఆయుర్వేద వైద్యశాల యోగా గురువు జ్యోతి రాజేంద్రకుమార్ ప్రతిభకు ప్రశంస లభించింది. బెంగళూరు అనంత్య గేట్–9 ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఆదివారం గ్లోబల్ యోగా సమ్మిట్ – 2023 జరిగింది. ఇందులో వివిధ దేశాల యోగా సాధకులు ప్రదర్శన ఇచ్చారు. గండవరం నుంచి రాజేంద్రకుమార్ సమ్మిట్‌లో పాల్గొని ప్రతిభ చూపారు. దీంతో ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక గ్రామంలో ఉన్న శ్రీమొలక పోలేరమ్మ ఆలయానికి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ ఆవరణలో ఆలయ చైర్మన్ పెనుమల్లి గోపాల్‌రెడ్డి స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిక్కవరపు వసుంధర, ఎంపీడీఓ చెన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, అర్చకులు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నిరంజన్‌బాబురెడ్డిని కలిసిన నేతలు



కోవూరు: రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డిని పలువురు నాయకులు ఆదివారం కలిశారు. మండలంలోని పడుగుపాడు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ షేక్ అహ్మద్ వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి, షేక్ జిలానీబేగంని కార్యదర్శిగా నియమించారు. వారు నిరంజన్‌బాబురెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, జల్‌జీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు షబ్బీర్, నాగార్జున పాల్గొన్నారు.

క్రిస్మస్‌ను సంతోషంగా చేసుకోవాలి



కోవూరు: ప్రేమ, ఆప్యాయతలకు చిహ్నమైన ఏసుక్రీస్తు బోధనలు ప్రజలకు శాంతిని చేకూరుస్తాయని, సోమవారం క్రిస్మస్ పండగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రార్థించాలని ఎమ్మెల్యే కోరారు.

మరోసారి నవ్వులపాలైన సోమిరెడ్డి

- ఆయన తీరుపై సొంత పార్టీ నేతలే విమర్శలు



గతంలో సోమిరెడ్డితో కార్యకర్తలు (వృత్తంలోని వారు)

వెంకటాచలం: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.. సర్వేపల్లి నియోజకవర్గంలో ఓటమికి చిరునామాగా నిలిచిన టీడీపీ నాయకుడు. తన చేష్టలతో ఈయన ప్రతిసారి నవ్వులపాలవుతున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పడం తప్ప పార్టీలో ఉండే విషయంలో వారిని కాపాడుకోలేకపోతున్నారు. దీంతో వారంతా రోజుల వ్యవధిలోనే వైఎస్సార్‌సీపీలో చేరిపోతున్నారు. ఈ విషయంలో సోమిరెడ్డి పలు దఫాలు అపహాస్యం పాలయ్యాడు. ఇటీవల తిక్కవరప్పాడు పంచాయతీ జోసఫ్‌పేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నట్లుగా సోమిరెడ్డి ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆర్భాటంగా ప్రకటించి కండువాలు కప్పారు. అయితే రోజుల వ్యవధిలో ఆ కార్యకర్తలు ఆదివారం ఉదయం వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. చంద్రమోహన్‌రెడ్డి తీరు కారణంగానే పార్టీలో చేరిన వారు ఉండడం లేదని, ఆయన అసమర్థతకు ఇది నిదర్శనమని సొంత పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు.

వైభవంగా గ్రామోత్సవం



ముత్తుకూరు: హనుమంత వాహనంపై..



మనుబోలు: నృసింహుడి గ్రామోత్సవం శేష వాహనంపై..

ముత్తుకూరు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో శనివారం రాత్రి విశేష పూజలందుకున్న శ్రీమన్నారాయణుడికి ఆదివారం వేకువజాము వరకు గ్రామోత్సవం జరిపారు. ఈపూరులోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో హనుమంతు వాహనంపై గ్రామోత్సవం జరిగింది. కృష్ణపట్నం, ముత్తుకూరు గ్రామాల్లోని చెన్నకేశవ స్వామి ఆలయాల్లో భక్తులు జాగారం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మనుబోలు: మండలంలోని లక్ష్మీనరసింహాపురం గ్రామంలో శనివారం రాత్రి శేష వాహనంపై నృసింహుడి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మి నృసింహస్వామి ఆలయంలో అర్చకులు కేశవాచార్యులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ అలంకరణ చేశారు. అనంతరం శేష వాహనంపై కొలువుదీర్చి మేళతాళాల మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

'ఆడుదాం ఆంధ్రా'పై అవగాహన ర్యాలీ



కొడవలూరులో ర్యాలీ



ఇందుకూరుపేట: క్రీడాకారులతో అధికారులు, నాయకులు

కొడవలూరు: మండల కేంద్రమైన కొడవలూరులో ఆడుదాం ఆంధ్రాపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఐదు రకాల క్రీడా పోటీలను ఈనెల 26వ తేదీన ప్రారంభిస్తోందన్నారు. అనేకమంది ఉత్సాహంగా పేర్లు నమోదు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.ప్రతాప్, డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్, వలంటీర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

- **ఇందుకూరుపేట:** ఈనెల 26వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.నాగ్రేందబాబు తెలిపారు. మండలంలోని సచివాలయాల పరిధిలో ఆదివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, భీమవరపు వెంకటకృష్ణారెడ్డి, వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు సత్కారం



నెల్లూరు రూరల్ : నగరంలోని పొదలకూరు రోడ్డు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ వారు 'నిండునూరేళ్లు వర్ధిల్లు' కార్యక్రమంలో భాగంగా ఈనెలలో జన్మించిన వారిని ఆదివారం సత్కరించారు. వాకర్స్ సభ్యులు సావిత్రమ్మ, శేషమ్మ, మేరీ బ్లేసింగ్‌టన్, కామాక్షిమానస సత్కారాన్ని అందుకున్నారు. అనంతరం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తుంగా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చదువే కాదు.. క్రీడలూ ముఖ్యమే..



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి

తోటపల్లిగూడూరు: ప్రతి విద్యార్థికి జీవితంలో చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వరిగొండ శాస్త్ర ఫార్మసీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా అవగాహన కార్యక్రమానికి మంత్రి కాకాణి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగియున్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని తీర్చిదిద్దాలనే ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 15 సంవత్సరాల వయసు నిండిన వారికి ఇది మంచి అవకాశమన్నారు. ఆడుదాం ఆంధ్రా జిల్లా ప్రత్యేకాధికారి, డీపీఓ సుప్రజ మాట్లాడుతూ ఇప్పటి వరకు సర్వేపల్లి నియోజకవర్గంలో 1,790 టీంలు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ముందుగా మంత్రి కాకాణి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వరిగొండ పంచాయతీకి 971 వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు కార్డులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మలోల, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, ఎంపీడీఓ ప్రత్యూష, తహసీల్దార్ లావణ్య, ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులునాయుడు, నాయకులు ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి, చింతంరెడ్డి దశరథరామిరెడ్డి, కామిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జలదంకి హరి, జానా జగదీష్, వరిగొండ గోవర్ధన్, ముక్కాల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.